సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం | 7 | మార్చి | 2025



ఎకోక్లబ్ నిర్వహణకు నిధులు!

జిల్లాలోని 454 ప్రైమరీ, 101 ప్రాథమికోన్నత, 103 హైస్కూళ్లలో ఎకోక్లబ్‌ల నిర్వహణకు నిధులు విడుదలయ్యాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఖాతాల్లో జమయ్యాయి. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్రవారం: 6:20	శనివారం: 5:14

గరిష్ఠం/కనిష్ఠం
35.0/18.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

స్థల పరిశీలన

నార్నూర్: కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు కోసం గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ డీఈ శివప్రసాద్, తహసీల్దార్ రాజలింగు మాట్లాడారు. మండల కేంద్రంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. స్థలానికి సంబంధించిన వివరాలు కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. వారి వెంట ఏఈఈ రాథోడ్ సునీల్ తదితరులున్నారు.

సెకండియర్ పరీక్షలు షురూ

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షకు 9,114 మంది విద్యార్థులకు 8,720 మంది హాజరు కాగా, 394 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో జాదవ్ గణేశ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.

ఉపాధిహామీ కూలీలందరికీ పనులు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న రవీందర్ రాథోడ్

తలమడుగు: దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఉపాధి కూలీకి పని కల్పించాలని డీఆర్డీవో రవీందర్ రాథోడ్ సూచించారు. గురువారం మండలంలోని సుంకిడి, కుచులాపూర్ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో అక్రమాలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. పనులకు వస్తున్న కూలీల వివరాలు ప్రతీరోజు రెండుసార్లు ఫొటో తీసుకుని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం వేగవంతం చేయాలని, వేసవిలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో మేఘమాల, ఈసీ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో గంజాయిని పూర్తిగా నిర్మూలించాలి


కైలాస్‌నగర్: మాదక ద్రవ్యాలు, గంజాయిని జిల్లాలో పూర్తిగా నిర్మూలించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో మాదక ద్రవ్యాల నిర్మూలనపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి, అందులో పోలీస్, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు ప్రతీ వారం గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఎవరైనా గంజాయి లేదా మాదకద్రవ్యాల బారిన పడితే స్థానిక డీఅడిక్షన్ సెంటర్లలో చేర్పించి బాగు చేయాలని సూచించారు. ఎస్పీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, పోలీస్, వైద్యారోగ్య, ట్రాన్స్‌పోర్టు, ఎక్సైజ్ శాఖల అధికారులు, మెడికల్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

16న పాఠశాల ప్రవేశ పరీక్ష

ఉట్నూర్‌రూరల్: ఈనెల 16న తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో (ఈఎంఆర్ఎస్) ఆరోతరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించనున్నట్లు ఉట్నూర్ ఈఎంఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ అర్విందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను విద్యార్థులు ఈనెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ప్రమాదాలు నియంత్రించాలి

కైలాస్‌నగర్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రతపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ రంబుల్ స్ట్రిప్స్, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్పీడ్ లేజర్ గన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సాయంత్రం డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, ఆర్డీవో వినోద్‌కుమార్, ఆర్అండ్‌బీ, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



మీనాక్షి నటరాజన్

హస్తవ్యస్తం!

- ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పట్టు పోతోందన్న కాంగ్రెస్ నేతలు
- పక్క జిల్లా నేత కారణమని ఆరోపణ
- పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి ఎదుట ఆవేదన
- సమన్వయం లేదన్న మంత్రి సీతక్క
- దిద్దుబాటు చర్యలకు ప్రత్యేక కమిటీ

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలోని కాంగ్రెస్ నేతల్లో నెలకొన్న విబేధాల వ్యవహారానికి పూర్తిగా తెరపడ్డట్లయింది. ఏకంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఎదుటే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు పార్టీ స్థితిగతుల గురించి చెబుతూ వాపోయారు. వ్యవహారం ఇలాగే కొనసాగితే పార్టీ పూర్తిగా పట్టు కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగు జిల్లా నేత ఇక్కడి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం శృతిమించిపోయిందని ఇన్‌చార్జి ఎదుట నేరుగా ఆ నేత పేరు చెప్పారు. ఈ వ్యవహారం ఇప్పుడు పార్టీలో సంచలనం కలిగిస్తోంది. మొత్తంగా పార్టీ పరిస్థితులను చక్కదిద్దాలంటే ఇక్కడ ప్రత్యేక కమిటీలు నియమించాల్సిందేనని రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నగరాజన్ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే ఆ దిశగా ఆమె కార్యాచరణ చేపట్టేందుకు సిద్ధం కావడం పార్టీలో చర్చనీయాంశమైంది.

దిద్దుబాటు చర్యలేవి?

కాంగ్రెస్‌లో పార్లమెంట్ ఎన్నికలకు ముందు నుంచే నెలకొన్న విబేధాలు పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లినా ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. పార్టీలో ముఖ్య నాయకులు ఇన్నాళ్లు చెప్పుకోలేని పరిస్థితిలో మౌనం దాల్చగా, కొత్తగా నియమితులైన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాక, ఆమె సమావేశంలో ఏ విషయాన్నైనా నేరుగా చెప్పండని నాయకులతో పేర్కొనడంతో వారు కూడా ధైర్యం చేసి జిల్లాలో నెలకొన్న పరిస్థితులను ఆమె ముందు ఏకరువు పెట్టారు. దీంతో కొన్నాళ్లుగా ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీలో తీవ్రరూపం దాల్చిన పరిస్థితులు రాష్ట్ర ఇన్‌చార్జి దృష్టికి వెళ్లాయి. బుధవారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఇన్‌చార్జితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఈ పార్లమెంట్ పరిధి నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ మంత్రి ఐకే రెడ్డి, వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ దండే విఠల్, నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, శ్రీహరిరావు, ఆడె గజేందర్, సీనియర్ నాయకులు నరేశ్ జాదవ్, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి, రేఖానాయక్, రాథోడ్ బాపూరావు తదితరులు హాజరయ్యారు.

సమన్వయ లేమితోనే..

ఈ దశలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నేతల మధ్య సమన్వయలేమి ఉందని రాష్ట్ర ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమికి ఇవే కారణమయ్యాయని ఆమె వివరించారు. రాష్ట్ర కేబినెట్‌ను పూర్తిస్థాయిలో విస్తరించిన తర్వాత, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా తాను తప్పుకొంటానని సీతక్క పేర్కొనడం ఈ సమావేశంలో కలకలం సృష్టించింది. ఈ పరిస్థితుల్లో ఆదిలాబాద్‌లో పార్టీ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీని నియమించాలని, ఈ సమస్యను పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)కి సిఫారసు చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం వారీగా ఓ త్రీమన్ కమిటీని నియమించి పార్టీని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. అంతే కాకుండా జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి డీసీసీ, నామినేట్ పదవుల నియామకంలో సీనియర్ నాయకులకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

నేతల మధ్య కుదరని సయోధ్య

పార్టీలో పాత నాయకులు తమకు ప్రాధాన్యత దక్కడం లేదని ఓ వైపు వాపోతుండగా.. పార్టీలోకి వచ్చిన ముఖ్య నేతలు తమకు పార్టీలో అసలు ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి ఉందని రాష్ట్ర ఇన్‌చార్జి ఎదుట ఏకరువు పెట్టినట్లు తెలుస్తోంది. ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ తనకు నియోజకవర్గంలో పర్యటనలకు సంబంధించి కనీస సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉండి, ఆతర్వాత ఇతర పార్టీలోకి వెళ్లిన తాను మళ్లీ మాతృ పార్టీలోకి వచ్చిన తర్వాత గుర్తింపు లభించడం లేదని ఇన్‌చార్జి ఎదుట వాపోయినట్లు సమాచారం. బీఆర్ఎస్ నుంచి ఈ పార్టీలోకి వచ్చిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలదీ ఇదే పరిస్థితి అని ఆమె పేర్కొన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా పార్లమెంట్ పరిధిలో పార్టీ పరంగా ఉన్న పరిస్థితులు రాష్ట్ర ఇన్‌చార్జి దృష్టికి వెళ్లడంతో ఇకనైన పార్టీని గాడిలో పెడతారా.. అని కాంగ్రెస్ నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పక్క జిల్లా నేత జోక్యంపై గుస్సా

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో గత ఎన్నికలకు ముందు నుంచి పక్క జిల్లా నేత జోక్యం చేసుకోవడం, అన్ని వ్యవహారాల్లో కల్పించుకోవడంపై జిల్లా నాయకులు రాష్ట్ర ఇన్‌చార్జికి ఫిర్యాదు చేశారు. అసలు జిల్లాకు ఆయనకు సంబంధం లేకపోయినా అన్ని వ్యవహారాల్లో ఆయనే జోక్యం చేసుకోవడమేమిటని వారు ఆవేదన వెల్లగక్కారు. ఈ విషయంలో ఒకరిద్దరు నాయకులు ఆ నేత తీరును వివరించినప్పటికీ, మొదట పేరు చెప్పనట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్ర ఇన్‌చార్జి జోక్యం చేసుకుని నేత పేరు చెప్పాలని నాయకులతో పేర్కొనడంతో వారు ధైర్యం చేసి అందిరి ముందే అతడి పేరు వెల్లడించినట్లు సమాచారం. దీంతో సమావేశంలో కొంతమంది నేతలకు ఈ పరిస్థితి మింగుడు పడని విధంగా మారినట్లు చెప్పుకొంటున్నారు. అంతే కాకుండా జిల్లాతో సంబంధమున్న ఓ ముఖ్య ప్రజాప్రతినిధి ఫోన్ చేసినా లేపడం లేదని కాగజ్‌నగర్‌కు చెందిన ఓ నాయకుడు రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఎదుట వాపోయినట్లు తెలుస్తోంది.

మరిన్ని ఎస్‌హెచ్‌జీలు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న మెప్మా ఉద్యోగులు (ఫైల్)

- ఏర్పాటుకు ఆదేశించిన ప్రభుత్వం
- ఆదిలాబాద్ బల్దియా లక్ష్యం.. 115
- ఇప్పటికే 69 సంఘాల ఏర్పాటు
- లక్ష్యసాధన దిశగా మెప్మా సిబ్బంది
- ఈ నెలాఖరు వరకే గడువు విధింపు

ఆదిలాబాద్‌లోని వార్డులు : 49
తెల్ల రేషన్‌కార్డులు : 29,346
ప్రస్తుత ఎస్‌హెచ్‌జీలు : 2,567
సంఘాల్లోని సభ్యులు : 26,042

కైలాస్‌నగర్: తెల్లరేషన్ కార్డు కలిగి 18 ఏళ్లు నిండిన వివాహితులందరినీ స్వయం సహాయక సంఘాల్లో (ఎస్‌హెచ్‌జీ) సభ్యులుగా చేర్పాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో కొత్తగా 115 సంఘాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) టీకే శ్రీదేవి గత నెల 24వ తేదీన ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా కసరత్తు చేపట్టిన మెప్మా సిబ్బంది స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన శ్రమిస్తున్నారు. వార్డుస్థాయిలోని మహిళలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఎస్‌హెచ్‌జీల్లో చేరితే కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నారు. ఇప్పటివరకు కొత్తగా 69 సంఘాలు ఏర్పాటు చేయించారు. ఈ నెలాఖరునాటికి లక్ష్యాన్ని చేరుకునేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

మహిళల అభివృద్ధికి పెద్దపీట

కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం చేపట్టిన నుంచి మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రుణాలు అందజేస్తూ వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా ప్రోత్సహిస్తోంది. దీంతో పాటు వివిధ రకాల 13 అంశాల్లో వారు స్వయం ఉపాధిని పొందడంతో పాటు ఆర్థికంగా ముందుకు సాగేలా ఇందిరా మహిళాశక్తి కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం కింద రూ.20 లక్షల నుంచి రూ.5కోట్ల వరకు రుణాలు ఇస్తూ వ్యాపారంలోనూ ముందుకు సాగేలా ప్రోత్సహిస్తోంది. ఇంతలా ప్రోత్సాహం అందిస్తున్నా ఇప్పటికీ అనేక మంది మహిళలు సంఘాల్లో లేనట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వ ప్రయోజనాలకు దూరంగా ఉన్న వారికి ఆర్థిక చేయూత అందించాలని భావించి వారినీ ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా చేర్పాలని సంకల్పించింది. ఆ దిశగా మెప్మా సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది.

కొత్త సంఘాల లక్ష్యం 115

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని తెల్ల రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం కొత్తగా 115 ఎస్‌హెచ్‌జీలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. 18 ఏళ్లు దాటిన, పెళ్లి చేసుకుని కొత్తగా మెట్టినింటికి వచ్చిన మహిళలను సంఘంలో నమోదు చేయించాలని ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా చర్యలు చేపట్టిన మెప్మా సిబ్బంది లక్ష్యాన్ని సాధించేదిశగా ముందుకు సాగుతున్నారు. ప్రతీ సీవో పరిధిలోని రిసోర్స్‌పర్సన్లు తమతమ వార్డుల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం.. కల్పిస్తున్న రాయితీలు, బీమా సౌకర్యం తదితర ప్రయోజనాలను వారికి వివరిస్తూ సంఘంలో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. పది రోజుల వ్యవధిలోనే జిల్లాలో కొత్తగా 69 సంఘాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సంఘంలో 10 మంది మహిళలను సభ్యులుగా నమోదు చేయిస్తున్నారు. ఇలా 690 మంది మహిళలను కొత్తగా సంఘాల్లో సభ్యులుగా చేర్పించారు. ఇంకా 46 సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా లక్ష్యాన్ని సాధించేలా ముందుకు సాగుతున్నారు. సంఘాల్లో చేరిన మహిళల ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని బ్యాంక్ ఖాతాలు తెరిపిస్తున్నారు. పొదుపు చేయడం రుణాలు పొందే విధానంపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే కలిగే ప్రయోజనాల గురించి అర్థమయ్యేలా వివరిస్తున్నారు.

గడువులోపు లక్ష్యం సాధిస్తాం



స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా లేని మహిళలందరినీ సంఘాల్లోకి తీసుకురావాలని, తద్వారా కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మున్సిపాలిటీకి లక్ష్యాన్ని నిర్దేశించింది. సీవోలు తమ పరిధిలోని రిసోర్స్ పర్సన్లతో వార్డుల వారీగా మహిళలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. సంఘాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. సంఘాల్లో చేరితే కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నారు. ఆరు నెలలు సక్రమంగా పొదుపు చేసే సంఘాలు రూ.5లక్షల రుణం పొందవచ్చు. రుణ మొత్తాన్ని సకాలంలో చెల్లిస్తే రూ.10లక్షల వరకూ రుణం ఇస్తారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. మార్చి నెలాఖరునాటికి లక్ష్యాన్ని సాధిస్తాం.

– శ్రీనివాస్, మెప్మా డీఎంసీ, ఆదిలాబాద్

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న ఎంపీ గోడం నగేశ్, నాయకులు

బజార్‌హత్నూర్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి మండలంలోని గిర్నూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మాజీ సర్పంచ్ కృష్ణ, నాయకులు రాజారాం, భూమయ్య, సకేశ్, మారుతి, నాన రమణ, అల్కె గణేశ్, నాన రమణ, పోరెడ్డి శ్రీనివాస్, కొత్త శంకర్ పాల్గొన్నారు.

'నీట్' నిర్వహణకు కేంద్రాలు గుర్తించాలి

- కలెక్టర్ రాజర్షి షా ఆదేశం
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: మే 4వ తేదీన నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) నిర్వహణకు జిల్లాలో పరీక్షాకేంద్రాలు గుర్తించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీట్ నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నీట్ అర్హత పరీక్ష కోసం జిల్లాలోని కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, రైల్వే స్కూళ్లు, ఆర్మీ స్కూళ్లు, ఇంజినీరింగ్ కళాశాలలు, సీబీఎస్ఈ విద్యాలయాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలను సందర్శించి అందులో మౌలిక వసతులు కల్పించాలని, ఆ తర్వాతే నివేదిక అందించాలని సూచించారు. పరీక్షాకేంద్రాల ఎంపికకు నిబంధనల ప్రకారం అందులో ఉండాల్సిన మౌలిక వసతులపై ఆరా తీశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా బెంచీలు, కుర్చీలు, తాగునీరు, మూత్రశాలలు, సీసీ కెమెరాల పనితీరు, తరగతి గదులు, లైటింగ్, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలు పర్యవేక్షించాలని సూచించారు. వీటిపై అధికారులందించే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతీ గదిలో 24 మంది అభ్యర్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీవో వినోద్‌కుమార్, జిల్లా విద్యాధికారి ప్రణీత, కళాశాలల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించుకుని రాయితీ పొందాలి

అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను ఈ నెల 31వ తేదీలోపు క్రమబద్ధీకరించుకుని ఫీజులో 25శాతం రాయితీ పొందాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎల్‌టీపీ ఇంజినీర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పంచాయతీ, మున్సిపల్, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకునేలా దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుం చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో 4వేలకు పైగా మున్సిపల్, 3వేలకు పైగా పంచాయతీల్లోని ప్లాట్లకు ఫీజు చెల్లింపునకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. 26, ఆగస్టు 2020లో దరఖాస్తు చేసుకున్న వారు మున్సిపల్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సంప్రదించి ప్లాట్లను రెగ్యులైజ్ చేసుకోవాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ ద్వారా నిర్ణీత నమూనాలో నూతన దరఖాస్తులు సేకరించి ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, డీఎల్పీవో ఫణీందర్‌రావు, ఆర్డీవో వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, సబ్ రిజిస్ట్రార్ విజయ్‌కాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'మా భూములు మాకివ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్

ఆదిలాబాద్: సీసీఐ కోసం సేకరించిన భూములను తిరిగి తమకు అప్పగించాలని సీసీఐ భూనిర్వాసితుల సంఘం నాయకుడు అరవింద్ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన గురువారం సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీసీఐ పరిశ్రమ ఏర్పాటు సమయంలో స్థానిక రైతుల నుంచి 779 ఎకరాల సాగు భూమిని నాటి కేంద్ర ప్రభుత్వం నామమాత్రపు పరిహారమిచ్చి సేకరించిందని ఆరోపించారు. పరిశ్రమలో వందేళ్ల దాకా రైతులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ పరిశ్రమను 1998లో మూసివేయడంతో భూములు కోల్పోవడమే కాకుండా ఉద్యోగాలనూ కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోయారు. 30 ఏళ్లుగా ఈ పరిశ్రమ ప్రారంభం కోసం పాలకులు ఎన్నికల్లో హామీ ఇస్తూ పూర్తిగా విస్మరిస్తున్నారని విమర్శించారు. ఈ పరిశ్రమను స్క్రాప్ కింద అమ్ముకోవడానికి యాజమాన్యం కేంద్ర ప్రభుత్వం అనుమతితో టెండర్ ప్రక్రియ కొనసాగిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. ఇంతవరకు పరిశ్రమ పునరుద్ధరణ జరుగుతుందని ఎంతో ఆశతో ఉన్నామని, ప్రస్తుతం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఆశలు సన్నగిల్లాయని పేర్కొన్నారు. ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమ పునరుద్ధరణకు ప్రయత్నించాలని, లేని పక్షంలో తీసుకున్న పరిహారం సొమ్ము తిరిగి ఇస్తామని, తమ భూములు తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి ప్రయత్నిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాజన్న, ఈశ్వర్ దాస్, రామ్‌రెడ్డి, కృష్ణ, విఠల్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



శరత్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ కార్యదర్శి శరత్‌కు ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గురువారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని నూతన ఐటీడీఏ భవన నిర్మాణానికి రూ.15 కోట్లు, నూతన స్టడీ సర్కిల్ నిర్మాణానికి రూ.2 కోట్లు, రాజ్‌గోండు సేవా సమితి గుస్సాడీ గుట్ట వద్ద నూతన భవన నిర్మాణానికి రూ.కోటి, ఉట్నూర్ నుంచి కొమ్ముగూడ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

కైలాస్‌నగర్: ఈ నెల 21నుంచి ఏప్రిల్ 4వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించనున్న పరీక్షలకు జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు 10,051, ప్రైవేట్‌గా 55 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. వీరి కోసం 52 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. పరీక్ష సమయాల్లో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా బస్సులు నడపాలని ఆర్టీసీకి సూచించారు. కేంద్రాలను తనిఖీ చేసేందుకు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ప్రతీ కేంద్రంలో మహిళా కానిస్టేబుల్ ఉండేలా చూసుకోవాలని, అధికారులంతా సమన్వయంతో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. డీఈవో ప్రణీత, సీఎస్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులున్నారు.

క్లుప్తంగా

మూడు ఎడ్లు చోరీ

తానూరు: మండలంలోని హిప్నెల్లితండాలో రైతు తాన్‌సింగ్‌కు చెందిన మూడు ఎడ్లు బుధవారం రాత్రి చోరీ గురైనట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. రైతు తాన్‌సింగ్ ఎడ్లను మేపి హిప్నెల్లి రోడ్డు పెట్రోల్‌బంక్ సమీపంలో తన పొలంలో బుధవారం కట్టివేశాడు. ఇంటికి అన్నం తినేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి ఎడ్లు కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

షెడ్డు కూల్చేసిన కేసులో ఇద్దరికి జరిమానా

మంచిర్యాలక్రైం: అక్రమంగా షెడ్డు కూల్చేసిన కేసులో ఇద్దరికి రూ.6వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (ఎక్సైజ్ కోర్టు) న్యాయమూర్తి డి.ఉపనిషద్వని గురువారం తీర్పునిచ్చారు. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. జన్మభూమినగర్‌కు చెందిన వంగ లక్ష్మణ్‌రావ్ గర్మిళ్ల శివారులోని 330 సర్వేనంబర్‌లో షెడ్డు నిర్మించారు. మందమర్రి మండలం రామకృష్ణపూర్‌కు చెందిన జాడి రాజేష్, జాడి మల్లయ్య మరి కొందరితో కలిసి 2015 మే 22న ఆ షెడ్డును జేసీబీతో కూల్చివేశారు. లక్ష్మణ్‌రావు ఫిర్యాదుతో అప్పటి ఎస్సై ఎస్‌కే లతీఫ్ కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు అనంతరం పీపీ అజయ్‌కుమార్ సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో ఇద్దరికి జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు.

విద్యుత్ వినియోగదారులూ.. తస్మాత్ జాగ్రత్త

మంచిర్యాలక్రైం: ఇటీవల కొందరు వ్యక్తులు విద్యుత్ మీటర్ తిరగకుండా చేస్తామని వినియోగదారులను మోసం చేస్తున్నారని, అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ విజిలెన్స్ సీఐ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ బిల్లు రాకుండా చేస్తామని నమ్మించి డబ్బులు తీసుకొని మీటర్‌లోని కొన్నివైర్లు కట్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అలాంటి వారు ఎవరైనా వస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇసుక లారీ పట్టివేత



లారీ, జేసీబీ, నిందితులతో టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఉపేందర్‌రావు, పోలీసులు

జైపూర్: మండలంలోని కిష్టాపూర్‌లో అక్రమంగా నిల్వచేసిన గోదావరి ఇసుకను రాత్రి లారీలో ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా పక్కా సమాచారంతో రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం వేకువజామున పట్టుకున్నారు. జిమ్మిడి నాగరాజు అక్రమంగా నిల్వచేసిన ఇసుక, షెట్‌పల్లికి చెందిన ధర్మాజీ సంతోశ్ జేసీబీ, ఇందారం గ్రామానికి చెందిన సాధిక్ లారీని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. ఈమేరకు ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన లారీ, జేసీబీని జైపూర్ పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు.

ఇసుక అక్రమ రవాణా..

వేలాలలో ప్రభుత్వం ఇచ్చిన ఇరిగేషన్‌శాఖ అనుమతులతో గతంలో ఇసుక క్వారీ కొనసాగింది. ఇటీవల అనుమతులు రద్దుతో మూతపడ్డాయి. వీటిని ఆసరాగా చేసుకున్న వేలాల, కిష్టాపూర్ వాసులు కొందరు నేతల సహకారంతో పగలు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గోదావరి నది నుంచి ఒక్క చోటుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి లారీల్లో కిష్టాపూర్ సమీపంలో సుందిళ్ల బ్యారేజీ మీదుగా పెద్దపల్లి జిల్లాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. పట్టణాల్లో ఇసుకకు ఉన్న డిమాండ్‌తో టన్నుకు రూ.వెయ్యికిపైగా రావడంతో ఒక్కలారీలో 40 నుంచి 50 టన్నులు రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

రోడ్ల విస్తరణకు నిధులు కేటాయింపు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గోదావరి నదిపై అంతర్గాం వరకు నిర్మించే బ్రిడ్జి నిర్మాణం కోసం కేటాయించిన పనులు రద్దు చేసి, ఆ నిధులు రూ.199 కోట్లతో జిల్లా కేంద్రంలోని రోడ్ల విస్తరణకు కేటాయిస్తూ రోడ్లు భవనాల శాఖ గురువారం జీవో విడుదల చేసింది. గోదావరి నదిపై బ్రిడ్జి పనులు ప్రారంభం కాకపోవడం, ఇతరత్రా కారణాలతో కేటాయించిన నిధులను రోడ్ల విస్తరణకు వినియోగించనున్నట్లు జీవోలో పేర్కొంది. ఐబీ చౌరస్తా నుంచి క్యాతన్‌పల్లి వరకు హైదరాబాద్, కరీంనగర్, చాందా రోడ్డు విస్తరణ పనులు, లక్ష్మీ టాకీస్ జంక్షన్ నుంచి పాతమంచిర్యాల వరకు రాళ్లవాగు కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణంతో చేపట్టనున్నారు. ఈ రోడ్డు పాతమంచిర్యాల, రంగంపేట్, ఆండాళమ్మ కాలనీలను కలుపనున్నారు. మున్సిపాలిటీ నుంచి రోడ్డును ఆర్‌అండ్‌బీ విభాగానికి బదిలీ చేయగా, విస్తరణ పనులను జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ సిరాజ్ ఉర్ రహమాన్‌కు అప్పగించారు.

పెరుగుతున్న హాజరు

- ఊపందుకున్న ఉపాధి
- పనులపై కూలీల ఆసక్తి



కోటపల్లి మండలం బోప్పారంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోటపల్లి: గ్రామాల్లో వలసలు నివారించి ఉన్న ఊరిలో ఉపాధి కల్పించేందుకు తీసుకువచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరందుకున్నాయి. జాబ్‌కార్డు కలిగిన కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లాలో ఉపాధిహామీ కూలీల హాజరు క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ప్రతీ పంచాయతీకి సరాసరి 33 మంది పనిచేస్తున్నారు. ఈనెలాఖరు వరకు 50కి పని కల్పించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. మొన్నటి వరకు యాసంగి పనులు ఉండటంతో కూలీలు అధికంగా అటువైపు మొగ్గు చూపారు. ఫిబ్రవరి చివరివారంలో జిల్లాలో 8 వేల వరకు కూలీలు పనిచేయగా ప్రస్తుతం 11 వేలకు పైగా హాజరవుతున్నారు. ఇప్పటికి ప్రారంభం కాని పనులు ఉంటే వాటి స్థానంలో ప్రత్యామ్నాయ పనులు గుర్తించి ఈనెలాఖరు నాటికి పూర్తి చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

పెరిగిన డిమాండ్

రాష్ట్రంలో ఉపాధి పనులు చేసిన భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12 వేలు అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది. దీంతో గ్రామాల్లో ఉపాధి పనులకు మరింత డిమాండ్ పెరుగుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. పనులు ఎప్పుడు ప్రారంభమైతే అప్పుడు వస్తామని కొందరు కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్లను కలిసి కోరుతున్నట్లు పేర్కొన్నారు.

అధికారులదే గుర్తించాల్సిన బాధ్యత

ఏటా మార్చి నుంచి ఉపాధి పనులకు డిమాండ్ ఉంటుంది. ఇప్పటికి వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు మార్చి 31వ తేదీ వరకు పనులకు హాజరవ్వడానికి వీలులేదు. దీంతో ఆయా కుటుంబాలు పనులకు దూరంగా ఉంటున్నారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త వార్షిక ఏడాది ప్రారంభమవుతుంది. అప్పుడు కూలీలందరూ పనులు చేసుకోవడానికి అర్హత సాధిస్తారు. కూలీలు పనిచేయడానికి ఇప్పటి నుంచే సిద్ధంగా ఉన్నారు. పనులు గుర్తించి సిద్ధం చేసి పెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

రైతులకు తప్పిన భారం

గతంలో తమ పొలాలకు వెళ్లేందుకు తలా కొంత నగదు జమ చేసుకుని రోడ్లు వేసుకునే వాళ్లు. ప్రస్తుతం ఉపాధి హామీ కింద ఫార్మేషన్ రోడ్లు నిర్మిస్తుండటంతో అన్నదాతలకు ఆర్థికభారం తప్పినట్లయింది.

జిల్లా	మండలాలు	పంచాయతీలు	జాబ్‌కార్డులు	కూలీలు
ఆదిలాబాద్	17	468	175747	370082
కుమురంభీం	15	335	129885	277287
నిర్మల్	18	396	180572	370550
మంచిర్యాల	16	311	121067	255151

జిల్లాలో హాజరు వివరాలు

తేదీ	హాజరైన కూలీలు
ఫిబ్రవరి 28	8295
మార్చి 1	8357
మార్చి 2	9877
మార్చి 3	11035
మార్చి 4	11108

లక్ష్యాన్ని చేరుకుంటాం

ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటాం. జాబ్‌కార్డు ఉండి అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నాం. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించాం.

– కిషన్, డీఆర్‌డీఏ, మంచిర్యాల

మేము బాగున్నాం..ఆందోళన చెందొద్దు

మలేషియా అక్రమ ఆయుధాల కేసులో ఇరుక్కున్న ఆరుగురు

- అక్కడి జైలులో బాధితులను కలిసిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి
- తమవారిని తీసుకురావాలని కుటుంబీకుల వేడుకోలు



గల్ఫ్ కుటుంబీకులతో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: మలేషియాలో అక్రమ ఆయుధాల కేసులో ఇరుక్కుని జైలులో మగ్గుతున్న ఆరుగురు 'మేము బాగున్నాం..తమ వాళ్లు ఆందోళన చెందవద'ని చెప్పాలని తనతో అన్నారని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ తెలిపారు. కడెం మండలం లింగాపూర్, మున్యాల గ్రామాలకు చెందిన ఆరుగురు గతేడాది అక్టోబర్ 28న అక్రమ ఆయుధాల కేసులో జైలుపాలయ్యారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు, బాధితులు తన దృష్టికి తీసుకురాగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో మలేషియాలోని బాధితులను కలిసి వచ్చానని గల్ఫ్ బాధిత కుటుంబీకులకు వివరించారు. గురువారం ఖానాపూర్‌లోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో జాన్సన్‌నాయక్‌ను గల్ఫ్ బాధిత కుటుంబీకులు కలిసి రోదించారు. మలేషియాలోని మలాక, ఏఎఫ్ మోసా ప్రాంతాల్లోని జైలులో ఉన్నవారు పనిచేసే ప్రాంతంలో అక్రమ ఆయుధాల కేసులో సంబంధం లేకున్నా ఇరుక్కున్నారని అన్నారు. ఎలాగైనా తమ వారిని తీసుకురావాలని కుటుంబీకులు వేడుకున్నారు. మాకు మీరే దిక్కని నిరుపేద కుటుంబాలకు చెందిన తాము, తమ వారిని బయటకు తీసుకువచ్చే మార్గం తెలియక గత ఐదునెలలుగా తడారని కళ్లతో ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జాన్సన్‌నాయక్ మాట్లాడుతూ మలేషియాలో అక్కడి న్యాయవాదితో కలిసి జైలులో ఉన్నవారిని ములాఖత్ అయినట్లు తెలిపారు. రెండు రోజులు అక్కడే ఉండి కేసు పూర్వాపరాలు తెలుసుకోవడంతోపాటు వారిని బయటకు తీసుకువచ్చేలా చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మరో 20 రోజుల్లో బయటకు వచ్చేలా న్యాయవాదికి తగు సూచనలు చేసినట్లు తెలిపారు.

భైంసాలో మూడిళ్లలో చోరీ

- ఓ బైక్‌ను ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని దొంగ



సాయిచరణ్‌రెడ్డి ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

భైంసాటౌన్: పట్టణంలోని గోకుల్‌నగర్‌లో తాళాలు వేసి ఉన్న మూడిళ్లలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. కాలనీలోని సాయిచరణ్‌రెడ్డి, రాహుల్ బుధవారం వారి ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం వెళ్లగా, అదే కాలనీలో ఐలాజిక్ కంప్యూటర్ సెంటర్‌కు తాళం వేసి ఉంది. దీంతో గుర్తుతెలియని దొంగ ఆయా ఇళ్ల తాళాలు పగులగొట్టి లోనికి చొరబడి చోరీకి పాల్పడ్డాడు. బాధితులు గురువారం ఉదయం చేరుకుని చూడగా వస్తువులన్నీ చిందరవందరగా ఉండడం గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించి, క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. సాయిచరణ్‌రెడ్డి ఇంట్లో రూ.20వేల విలువైన ఆభరణాలు, రాహుల్ ఇంట్లో రూ.లక్ష వరకు నగదు, ఆభరణాలు, ఐలాజిక్ కంప్యూటర్ కేంద్రంలో ఓ బ్లాంక్ చెక్కు అపహరణకు గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. అలాగే ఇదే కాలనీలో ఓ ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ సైతం ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ గోపినాథ్ వెల్లడించారు. నిందితుడిని గుర్తించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి



వినోద్ (ఫైల్)



బోల్తాపడిన ట్రాక్టర్ కింద మృతిచెందిన వినోద్

ఇంద్రవెల్లి: మండలంలోని ఓల్‌మద్రి సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందాడు. ఎస్సై సునీల్, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీకి చెందిన జెల్పెట్ వినోద్(35), తమ్ముడు పూలాజీతో కలిసి గురువారం అటవీశాఖ కార్యాలయంలో నర్సరీ నుంచి తన ట్రాక్టర్ ద్వారా ప్లాంటేషన్ మొక్కలు తరలిస్తున్నాడు. మార్గమధ్యలో ఓల్‌మద్రి సమీపంలో కల్వర్టు వద్ద ప్రమాదవశాత్తు బోల్తాపడింది. వినోద్‌పై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవింగ్ చేస్తున్న పూలాజీ సురక్షితంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని జేసీబీతో మృతదేహాన్ని బయటకు తీశారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీబాయి, కుమారుడు రుద్రక్షిత్, కూతుళ్లు ప్రకృతి, ఏడాది వయస్సు ఉన్న పాప ఉంది.

వంతెనపై నుంచి పడి వ్యక్తి..



ప్రశాంత్ సనా మృతదేహం

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్ సమీపంలో పోడ్సా అంతరాష్ట్ర వంతెన పై నుంచి పడి వ్యక్తి కిందపడి మృతిచెందాడు. సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం విలేజ్ నెంబర్ 12కు చెందిన ప్రశాంత్ సనా (31) వ్యాపారం నిమిత్తం బైక్‌పై బుధవారం ఉదయం మహారాష్ట్రలోని ధాబా గ్రామానికి వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి వస్తున్నాడు. మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దులో ఉన్న పోడ్సా అంతరాష్ట్ర వంతెనపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం మేరకు మృతుడి సోదరుడు ప్రమోత్ సనా సంఘటన స్థలానికి చేరుకున్నాడు. మృతుడు ప్రశాంత్ సనాగా గుర్తించాడు. సోదరుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన గంగారాం యువకులు



మొండయ్యతో గంగారాం యువకులు

నెన్నెల: చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని యువకులు గురువారం కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కొమ్ము మొండయ్య గంగారాంలోని దామెర చెరువులోకి వెళ్లి ఆత్మహత్యకు యత్నించగా అటుగా వెళ్లిన యువకులు సిగ్గం అంజి, సిగ్గం సంతోష్, రామటెంకి రాజేందర్, జాడి రాజ్‌కుమార్‌లు అతడిని బయటకు తీసుకొచ్చి ప్రాణాలు కాపాడారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై ప్రసాద్ హోంగార్డు రామరాజును పంపించారు. సదరు వ్యక్తిని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు. అతడి కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు. ప్రాణాలు కాపాడిన గంగారాం యువకులను ఎస్సై అభినందించారు. కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు బలవన్మరణం చెందారు. అప్పుల బాధతో ఆటోడ్రైవర్, అనారోగ్యంతో ఒకరు, భార్య కాపురానికి రావడం లేదని మరొకరు ఉరేసుకున్నారు. మానసిక పరిస్థితి బాగా లేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్

బజార్‌హత్నూర్: అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అప్పారావ్ తెలిపారు. ఎస్సై, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..మండలంలోని జాతర్ల పంచాయతీ పరిధి రాంనగర్ గ్రామానికి చెందిన భగత్ సంతోష్ (36) ఆటో నడుపుకుని జీవనం కొనసాగిస్తుండేవాడు. కుటుంబ పోషణకు, ఆటో కొనుగోలుకు రూ.4 లక్షలు ప్రైవేటు అప్పులు చేయగా వడ్డీలు పెరిగాయి. ఆదాయం అంతంత మాత్రమే ఉండటంతో అప్పు ఎలా తీర్చాలో మదనపడేవాడు. గురువారం ఉదయం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య రోజా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు, భార్య కాపురానికి రాలేదని మరొకరు

భైంసాటౌన్: భైంసా రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ నైలునాయక్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఇలేగాం గ్రామానికి చెందిన అవదూత్ పెద్ద పోశెట్టి (60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం తన ఇంట్లో ఉరేసుకున్నాడు. అలాగే దేగాంకు చెందిన ఇరగదెండ్ల ప్రవీణ్ (27) భార్య కాపురానికి రావడం లేదని బుధవారం రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మానసిక పరిస్థితి బాగా లేక వివాహిత..



రాజమణి (ఫైల్)

మంచిర్యాలక్రైం: మానసిక పరిస్థితి బాగాలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని గోపాలవాడకు చెందిన కనవేణి సతీశ్, రాజమణి(35) భార్యాభర్తలు. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. రాజమణి గత కొంతకాలంగా మానసికంగా బాధపడుతుంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాలేదు. ప్రతీరోజు భయం, భయంగా ఉంటుంది. తమ్ముడు రఘువర్ధన్ గమనించి అక్క రాజమణికి ధైర్యం చెప్పేవాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. మృతురాలి తమ్ముడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతర్జాతీయ కళా పోటీల్లో ఆదిలాబాద్ జిల్లావాసి ప్రతిభ



అవార్డుతో చంద్రశేఖర్

ఆదిలాబాద్‌టౌన్: దేశంలోని కళాకారులు, ఐదు దేశాలకు పైగా ఎన్ఆర్ఐల మధ్య నిర్వహించిన సెషన్ 16వ అంతర్జాతీయ కళాపోటీల్లో పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన గాదరి చంద్రశేఖర్ ప్రతిభ కనబర్చాడు. ఇన్నోవిజే గ్లోబల్ టాలెంట్ సెర్చ్ ర్యాంక్ స్లాట్ ప్రకారం ఐపీసీ నుంచి డ్రాయింగ్, పెయింటింగ్ విభాగంలో ది మెడల్ ఆఫ్ అప్రిషియేషన్‌తోపాటు ది లెటర్ ఆఫ్ రికగ్నిషన్ లెవల్-2లో ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నాడు. అర్హులైన కళాకారుల్లో ఒకరిగా పేరు సాధించుకున్నాడు. అవార్డు అందుకున్న ఆయన్ను బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

గోదావరికి సప్తహారతి



హారతి ఇస్తున్న శ్రీవేద భారతీ పీఠం సభ్యులు

బాసర: బాసర గోదావరినది పుష్కరఘాట్‌లో శ్రీవేద భారతీపీఠం వ్యవస్థాపకుడు వేద విద్యానందగిరిస్వామి ఆధ్వర్యంలో సప్తహారతి అందించారు.గంగాహారతి ప్రారంభించి గురువారం నాటికి 2,676వ రోజు పూర్తి చేసుకుంది. ప్రతీరోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు గోదారమ్మతల్లికి పూజలు నిర్వహిస్తారు. భక్తులు పాల్గొనాలని విద్యానందగిరిస్వామి కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని చున్నంబట్టి సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి.సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. హాజీపూర్ మండలం ముల్కల్లకు చెందిన శెటపల్లి నరేశ్..జిల్లాకేంద్రంలోని మెడికల్ కాలేజీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కాలేజీకి గురువారం బైక్‌పై వెళ్తుండగా సీసీసీ వైపు నుంచి మంచిర్యాలకు వస్తున్న లారీ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నరేశ్ మామ రాజయ్య ఫిర్యాదుతో లారీ డ్రైవర్ నర్సింహారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హోంగార్డు, మిత్రుడిపై కేసు

నిర్మల్‌టౌన్: ఓ వ్యక్తిని భయపెట్టి అతని వద్ద నుంచి డబ్బులు, సెల్‌ఫోన్ తీసుకున్న హోంగార్డు, ఆయన మిత్రుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మామడ మండలం కమల్‌కోట్‌కు చెందిన పత్తిరి రాజేశ్వర్ చికిత్స కోసం గురువారం జిల్లాకేంద్రంలోని ఓ హాస్పిటల్‌కు వచ్చాడు. అక్కడ ఓ మహిళ తన బంధువులతో మాట్లాడుతానంటూ రాజేశ్వర్ వద్ద నుంచి ఫోన్ తీసుకుని వెళ్లిపోయింది. గమనించిన హోంగార్డు సంజీవ్, అతని మిత్రుడు తిరుపతి ఇద్దరు పథకం ప్రకారం.. రాజేశ్వర్ వద్దకు వెళ్లారు. తమ మిత్రుడు భార్యకు ఎందుకు ఫోన్ చేసి వేధిస్తున్నావని భయపెట్టి, రూ.5 వేలు, సెల్‌ఫోన్ తీసుకున్నారు. రాజేశ్వర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎకో క్లబ్ నిర్వహణకు నిధులు!

- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఖాతాల్లో జమ
- విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన



ఎకో క్లబ్ విద్యార్థుల ర్యాలీ

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఎకో క్లబ్ కార్యకలాపాల నిర్వహణకు నిధులు విడుదలయ్యాయి. సమగ్ర శిక్ష హైదరాబాద్ కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ యూత్ క్లబ్ పాఠశాలలకు 2024–25 సంవత్సరానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని సర్కారు బడులకు నిధులు విడుదల చేశారు. ప్రాథమిక పాఠశాలకు రూ.3 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.5 వేలు చొప్పున కేటాయించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఖాతాల్లో జమ చేయనున్నారు. నిధులను ఆయా కమిటీల భాగస్వామ్యంతో ఖర్చు చేయాల్సి ఉంటుంది.

నిధుల వినియోగం ఇలా..

గ్రోగీన్ కార్యక్రమం, కిచెన్ గార్డెన్, పూలతోట, పండ్ల తోటల నిర్వహణ, వినాయక చతుర్థి పండుగ సందర్భంగా మట్టి విగ్రహాలను ఉపయోగించేందుకు ప్రోత్సహించడం..విస్తృత ప్రచారానికి బ్యానర్ వాడటం కోసం నిధులు రూ.1500 వినియోగించాల్సి ఉంటుంది. పర్యావరణ దినోత్సవాల (ఓజోన్, భూమి, జల) నిర్వహణకు ఉత్తమ ఎకో క్లబ్ పాఠశాలలకు ప్రశంసా పురస్కారాలు, పోస్టర్ పోటీ, క్విజ్, విద్యార్థుల కోసం వార్షిక పర్యావరణ సమావేశం, సెలవు కార్యక్రమం రూ.750 నిర్వహించాల్సి ఉంటుంది.

జిల్లా	ఉన్నతపాఠశాల	నిధులు
ఆదిలాబాద్	103	రూ.5,15,000
ఆసిఫాబాద్	55	రూ.2,75,000
మంచిర్యాల	104	రూ.5,20,000
నిర్మల్	114	రూ.5,70,000

నిధులు మంజూరు ఇలా..

జిల్లా	ప్రైమరీపాఠశాల	నిధులు	ప్రాథమికోన్నత	నిధులు
ఆదిలాబాద్	454	రూ.13,62,000	101	రూ.5,05,000
ఆసిఫాబాద్	525	రూ.15,75,000	98	రూ.4,90,000
మంచిర్యాల	478	రూ.14,34,000	94	రూ.4,70,000
నిర్మల్	489	రూ.14,67,000	83	రూ.4,30,000

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- ఈనెల 4న పురుగుల మందు తాగి..
- చికిత్స పొందుతూ మృతి



లావణ్య మృతదేహం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అత్తింటివారి అదనపు కట్న వేధింపులు భరించలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం ఊశన్నపల్లి గ్రామానికి చెందిన లావణ్య (23) 2020 ఫిబ్రవరి 15న హాజీపూర్ మండలం రాపల్లికి చెందిన మాడ శంకర్‌రెడ్డితో వివాహమైంది. పెళ్లయిన మూడునెలల తర్వాత భర్త, అతని తల్లిదండ్రులు లక్ష్మి-జనార్దన్‌రెడ్డిలు అదనపు వరకట్నం తీసుకురావాలంటూ వేధింపులకు గురిచేస్తూ వస్తున్నారు. ఈ విషయంలో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఇరువురి మధ్య సఖ్యత ఏర్పడి కాపురం చేయసాగారు. వీరికి ప్రస్తుతం ఇద్దరు కుమారులు ఉన్నారు. అయినప్పటికీ భర్త, అతని తల్లిదండ్రులు అదనపు వరకట్నం తేవాలని వేధించసాగారు. లావణ్య భరించలేక ఈనెల 4న గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి పంపించారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి తండ్రి రాములు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడిపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న జేఏసీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఉద్యోగులపై తప్పుడు ఫిర్యాదులతో వేధింపులకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకుడు సామ రూపేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కోరారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నంద అశోక్, ఏ.నవీన్‌కుమార్‌తోపాటు వివిధ శాఖలకు చెందిన 50 మంది ప్రభుత్వ ఉద్యోగులు గురువారం వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్‌ను కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఉద్యోగ జేఏసీ చైర్మన్ అశోక్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు తనపై తప్పుడు ఫిర్యాదు చేసి, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసి తన పరువుకు భంగం కలిగించారన్నారు. జిల్లాకేంద్రంలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు సంబంధించి ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రకటించిన వార్తను తాను వాట్సప్‌లో పోస్ట్ చేశానని, ఇది ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఈనెల 5న జరిగిన విషయమన్నారు. గజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శివ కుమార్, సంఘ బాధ్యులు నరేశ్, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు సప్దార్ అలీ, ఆశన్న, నర్సింలు, గోపి, ప్రవీణ్, అనిల్, అరుణ్, చంద్రశేఖర్, సంతోష్, రాజేశ్వర్, వెంకటేశ్, కలీం పాల్గొన్నారు.